సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 28 । జూన్ । 2024



మూడేళ్ల చిన్నారికి కేన్సర్

మూడేళ్ల చిన్నారి బోన్ కేన్సర్‌తో బాధ పడుతోంది. చికిత్స కోసం తల్లిదండ్రులు సాయం కోరుతున్నారు.

- 8లో



మెస్ లేదు.. క్లాస్ సాగదు

జీఆర్‌పేయూలో మెస్ తెరవడం లేదు. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.

- 8లో

మెరిట్ లిస్ట్‌కు కసరత్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 25న పూర్తి కాగా, మెరిట్ లిస్ట్ సిద్ధం చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌ల్లో మొత్తం 4400 సీట్లు ఉండగా, శ్రీకాకుళంలో 1100 సీట్లు ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ సీట్లతో కలిపి ఉన్నాయి. మొత్తం దరఖాస్తులు 53863 వచ్చాయి. టెన్త్ మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. జూలై 11న మెరిట్ లిస్టు ప్రకటిస్తారు.

న్యూస్‌రీల్

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. గురువారం సాయంత్రం పాఠశాలకు చెందిన 9 మంది బయటకు వెళ్లారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు నూడుల్స్‌ను తిన్నారు. నూడుల్స్ తిని హాస్టల్‌కు వచ్చిన కొద్దిసేపటికి జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలయ్యాయి. దీంతో వీరందరినీ హుటాహుటిన ఆశ్రమ పాఠశాలకు సమీపంలోనే ఉన్న రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేయడంతో వెంటనే మెరుగైన వైద్యాన్ని అందించేలా చర్యలు చేపట్టారు. అయితే నూడుల్స్ తినని ఇద్దరు కూడా స్వల్పంగా వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. ఈ తొమ్మిది మందిలో ఒకరిని ఐసీయూలో ఉంచి వైద్యాన్ని అందిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ తెలిపారు.

త్వరలో డిగ్రీ చివరి ఏడాది ఇన్‌స్టెంట్ పరీక్షకు నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో త్వరలో డిగ్రీ చివరి ఏడాది ఇన్‌స్టెంట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. ఎగ్జామినేషన్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. విద్యార్థులకు సమయం వృథా కాకుండా ఇన్‌స్టెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎడ్ మొదటి సెమిస్టర్ జూలై 19వ తేదీ నుంచి, బీఎడ్ నాల్గో సెమిస్టర్ జూలై 30 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. బీటెక్ ఏడో సెమిస్టర్, పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను గురువారం విడుదల చేసి, వర్సిటీ వెబ్ సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

'ఐటీడీఏ స్కూళ్లలో ఒడియా టీచర్లను నియమించాలి'



మాట్లాడుతున్న బృందావన్ దొళాయి తదితరులు

కవిటి: శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఐటీడీఏ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సమగ్రమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(ఆపోటా) శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది. గురువారం ఈ మేరకు కవిటి మండలం సహలాలపుట్టుగలో వారు ఈ విషయమై పత్రికల దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలో 8 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ప్రత్యేకంగా ఒడియా గిరిజన విద్యార్థుల కోసం ఒడియా మాధ్యమంలో నిర్వహిస్తున్నారని, ఈ స్కూళ్లలో ఒడియా మీడియంలో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల ఒడియా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 37 ఒడియా మాధ్యమం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర గిరిజన మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణికి నివేదిక అందించినట్లు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి తెలిపారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



డీటీకి వినతి పత్రమిస్తున్న దృశ్యం

నరసన్నపేట: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు ఇచ్చిన ప్రతి రైతుకి పంట రుణాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం నాయకులు వి.గిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై డీటీకి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కౌలు రైతులే అధికమని వీరందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. ఇతర రైతుల వలే తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారని అన్నారు. బ్యాంకర్లు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు సతీష్ పాల్గొన్నారు.

జోరువాన

ఎప్పటి నుంచో ఊరిస్తున్న వాన గురువారం దంచి కొట్టింది. జిల్లా కేంద్రంలో అయితే కాసేపే పడినా రోడ్లన్నీ మునిగిపోయేంతలా కుండపోత కురిసింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల జల్లులు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు ఈ వాన ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





శ్రీకాకుళంలోని చంద్ర మహల్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు, వానలో వాహనదారుల ఇక్కట్లు









ఆ వాట్సాప్ గ్రూప్ సేవలకు హ్యాట్సాఫ్



గ్రూపు అడ్మిన్ దామోదరరావుకు స్పందన పురస్కారం అందిస్తున్న ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు

- 'వే టు సక్సెస్' పేరిట 2 వేల మంది సభ్యులతో వాట్సాప్ గ్రూపు
- ఆరేళ్లుగా సేవలందిస్తున్న వైనం
- పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తూ యువతకు సాయం
- విజేతలుగా నిలుస్తున్న ఉద్దానం యువకులు



వే టూ సక్సెస్ లోగో

అక్కడ కొన్ని విజయ గాథలు ఉన్నాయి. వాటిలో కొన్ని స్ఫూర్తి మంత్రాలు దాగున్నాయి. ఊసు పోని కబుర్లకు వేదికగా నిలుస్తున్న వాట్సాప్ గ్రూపును పది మందికీ ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దవచ్చో చెప్పే ఉదాహరణలు ఉన్నాయి. ఇవన్నీ తెలుసుకోవాలంటే.. ఆ గ్రూపు గురించి తెలుసుకోవాలి. రెండు వేల మంది ఆరేళ్లుగా ఆ గ్రూపు ద్వారా పొందిన సాయం తెలుసుకోవాలి.



వే టు సక్సెస్ అన్న పేరుతో విజయానికి దారి చూపుతున్న ఈ వాట్సాప్ గ్రూప్‌నకు ఉద్దానం ప్రాంతానికి చెందిన విద్యావేత్త సీహెచ్ దామోదరరావు శ్రీకారం చుట్టారు. ఆయనే ప్రధాన అడ్మిన్‌గా ఉంటూ శ్రీను, రాజు, మనోజ్, మురళిలను సహాడ్మిన్లుగా చేర్చి సోషల్ మీడియా సాయంతో నిరుద్యోగ యువతకు సేవలు అందిస్తున్నారు. దామోదరరావు చేసిన సేవలను గుర్తిస్తూ అనేక సంస్థలు ఆయనను అనేక అవార్డులతో సత్కారించాయి.

పోటీ పరీక్షల మెటీరియల్ లభ్యం

ఈ గ్రూపులో ప్రధానంగా పోటీ పరీక్షల మెటీరియల్ లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లతో పాటు ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు విలువైన సమాచారాన్ని, పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే నిరుద్యోగ యువతకు ఈ గ్రూప్ ద్వారా పలు సలహాలు, సూచనలు కూడా అందిస్తూ వారికి మార్గ నిర్దేశం చేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ఉద్దాన యువతకు సైతం ఈ గ్రూపు ద్వారా విలువైన సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, రైల్వేతో పాటు గ్రూపు 1, గ్రూపు 2, బ్యాంకింగ్, పోలీసు, అటవీ శాఖ, ఉపాధ్యాయ, గ్రామ సచివాలయ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న యువతకు విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. అలాగే నవోదయ, సైనిక స్కూల్, సంక్షేమ పాఠశాల ప్రవేశ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న చిన్నారులకు సైతం ఈ గ్రూపు ద్వారా బాసటగా నిలుస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న చిన్నారులు

నిరుద్యోగులే కాదు.. చిన్నారులు కూడా ఈ గ్రూపు ద్వారా అందుతున్న సమాచారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 2023లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఇక్కడి చిన్నారులు అదరగొట్టారు. అలాగే ఉత్తరాంధ్ర ఓపెన్ క్విజ్ పోటీల్లోనూ ప్రతిభ కనబర్చారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఆనందంగా ఉంది..



నిరుద్యోగ యువతకు, చిన్నారులకు విలువైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్న లక్ష్యంతో 2018లో వే టు సక్సెస్ వాట్సాప్ గ్రూపుని ఏర్పాటు చేశాను. ఇప్పటి వరకు అనేక మంది నిరుద్యోగ యువకులు, చిన్నారులు దీన్ని సద్వినియోగం చేసుకొని వారి భవితకు బంగారు బాటలు వేసుకున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఈ గ్రూపు ద్వారా విలువైన సలహాలు, సూచనలు అందిస్తున్న విద్యావేత్తలకు కృతజ్ఞతలు.

గ్రూప్‌లో చేరాలనుకునేవారు 9490388708 నంబర్‌ను సంప్రదించాలి.

– సీహెచ్ దామోదరరావు, వాట్సాప్ గ్రూపు అడ్మిన్, సోంపేట మండలం

ఏయూ పీజీ సెట్‌లో రుక్మిణికి స్టేట్ ఫస్ట్



నీలాపు రుక్మిణి

టెక్కలి: ఆంధ్రా యూనివర్సిటీ వారు ఈ ఏడాది నిర్వహించిన పీజీ సెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని నీలాపు రుక్మిణి వృక్ష శాస్త్ర విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, బోటనీ లెక్చరర్ డి.వాసుబాబు రుక్మిణిని అభినందించారు.

పుణ్యవతికి ఫస్ట్ ర్యాంకు



తామాడ పుణ్యవతి

గార: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని ఏపీ పీజీ సెట్–2024లో భౌతిక శాస్త్రం విభాగంలో తామాడ పుణ్యవతి తొలి ర్యాంకు సాధించింది. మండలంలోని వత్సవలస గ్రామానికి చెందిన పుణ్యవతికి గురువారం విడుదలైన ఫలితాల్లో 75 మార్కులు సాధించింది. ఆమె శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో చదివింది.

10వ ర్యాంకు



కీర్తిక

ఆమదాలవలస: ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో ఆమదాలవలస మండలం కొత్తరోడ్‌కు చెందిన పైడి కీర్తిక జువాలజీ (జంతుశాస్త్రం) విభాగంలో 55 మార్కులు సాధించి 10వ ర్యాంకు పొందింది. ఈమె తల్లి ఈశ్వరమ్మ గృహిణి కాగా తండ్రి వ్యాపారం చేస్తున్నారు. జువాలజీ విభాగంలో ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రొఫెసర్‌గా కావడం తన లక్ష్యమని తెలిపారు. ఆమెకు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

12వ ర్యాంకు



అనిల్‌కుమార్

సరుబుజ్జిలి: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఏపీ పీజీసెట్‌లో మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన పొన్నాడ అనిల్‌కుమార్ యూనివర్సిటీ పరిధిలో ఫిజికల్ సైన్స్ విభాగంలో 12 వ ర్యాంకు(66 మార్కులు) సాధించాడు. ఈయన తల్లిదండ్రులు సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో జరిగింది.

సంతబొమ్మాళిలో శిలాఫలకం ధ్వంసం

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళిలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ శిలాఫలకంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పేర్లు ఉండడంతో ముక్కలు చేశారు. రాజకీయ కక్షతో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం తగదని వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఖండించారు.



ధ్వంసమైన శిలాఫలకం

మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలోని నోడల్ రిసోర్స్‌సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి తెలిపారు. అపోలో ఫార్మా లిమిటెడ్, పేటీఎం, నవత ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ కంపెనీ, అరబిందో తదితర సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ తదితర విద్యార్హతలను కలిగి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, 3 పాస్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

టెన్త్ సప్లిమెంటరీలో 60.32 శాతం ఉత్తీర్ణత

- వెలువడిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు
- జిల్లా నుంచి 2218 పరీక్ష రాయగా 1338 మంది పాస్



టెన్త్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు 60.32 శాతం ఉత్తీర్ణతను సాధించి.. జిల్లాను రాష్ట్ర స్థాయిలో 19వ స్థానంలో నిలిపారు. ఈ పరీక్షలు మే 24 నుంచి నెలాఖరు వరకు జరిగాయి. అనంతరం జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన మూల్యాంకనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని సరికొత్త సంస్కరణకు నాంది పలికింది. తీసుకొచ్చిన సాంకేతికత నేపథ్యంలో మ్యాథ్స్ సబ్జెక్టు మూల్యాంకనాన్ని ఆన్‌లైన్‌లో చేపట్టగా.. మిగిలిన సబ్జెక్టుల దిద్దుబాటును నేరుగా ఆఫ్‌లైన్‌లో చేపట్టారు.

1338 మంది ఉత్తీర్ణత..

మొత్తం మీద టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు పునర్విభజన శ్రీకాకుళం (30 మండలాలు)జిల్లా నుంచి 2218 మంది పరీక్షలకు హాజరుకాగా 60.32 శాతం ఉత్తీర్ణతతో 1338 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 1467 మంది పరీక్షకు హాజరుకాగా 58.49 శాతం ఉత్తీర్ణతతో 858 మంది పాసవ్వగా, బాలికలు 751 మంది పరీక్ష రాయగా 63.71 శాతం ఉత్తీర్ణతతో 480 మంది పాసయ్యారు. కాగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈనెల 27 నుంచి జూలై ఒకటి రాత్రి 11 గంటల వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో/మాన్యువల్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ అనే విద్యాశాఖ అధికారిక వెబ్ పోర్టల్‌లో షార్ట్ మార్క్స్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో పెండింగ్ కేసు పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును మధ్యవర్తిత్వంతో గురువారం కోర్టు హాల్ నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పరిష్కరించారు. కుటుంబ కలహాలు రావడం సహజం కానీ వాటిని సరిదిద్దుకుంటే సమాజంలో ఇరు పార్టీలకు గౌరవం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణ రాజు మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

30 నుంచి వెబ్ ఆప్షన్లు

గార: డీఈఈ సెట్–2024 ఫేజ్–2లో భాగంగా వెబ్ ఆప్షన్లకు ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు అవకాశం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కన్వీనర్, వమరవల్లి డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. సీట్ల కేటాయింపు ఐదు నుంచి ఏడో తేదీ లోగా జరుగుతుందని, తొమ్మిదో తేదీ నుంచి 13వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆదిత్యుడు కొలువుదీరడం ఇక్కడి వారి అదృష్టం

- అరసవల్లిలో ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు



చాగంటి దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న రంజిత్ శర్మ

అరసవల్లి: జిల్లాలో సూర్యభగవానుడు కొలువుదీరడం నిజంగా ఇక్కడివారి అదృష్టమని, ఇక్కడి నిత్యపూజా విధానాలు అత్యద్భుతంగా ఉన్నాయంటూ ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రశంసించారు. ఆయన సతీసమేతంగా గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేకంగా ఆహ్వానం పలికి అంతరాలయంలో విశేషంగా పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్ శర్మ తదితరులు చాగంటి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్రపై చాగంటి కొన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే అరసవల్లి క్షేత్రానికి ప్రత్యేకత వచ్చిందని, ఇక్కడి నిత్య పూజా విధానాలు, సూర్యనమస్కారాల పూజల ద్వారా దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. అనంతరం ఆదిత్యుని జ్ఞాపికను అర్చకులు, ఆలయ సిబ్బంది కలిసి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, సాందీప్ శర్మ, ఫణీంద్ర శర్మ, బీఎస్ చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో కొండ చిలువ కలకలం



హత మార్చిన కొండ చిలువ

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా గురువారం ఒక్కసారిగా పక్కన ఉన్న తోటల నుంచి కొండ చిలువ వచ్చింది. దీంతో వేతనదారులు పరుగులు తీశారు. అక్కడున్న వారు సర్పాన్ని హతమార్చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో ఓలేటి అగ్రహారం, జరజాం గ్రామాల్లో విద్యుత్ శాఖ ట్రాన్స్ ఫార్మర్ల చోరీపై గురువారం ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎచ్చెర్ల విద్యుత్ శాఖ ఏఈ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్సఫార్మర్లతో రాగి వైర్లను కొందరు చోరీ చేస్తున్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో రూ. 3000 విలువ చేసే రాగి వైర్లు ఉన్నట్లు అంచనా వేశారు. విద్యుత్ టాన్సఫార్మర్లు చోరీపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన 15 ఏళ్ల మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. ఇంటిలో ఉన్న టైల్స్ క్లీనింగ్ యాసిడ్ ద్రావణాన్ని ఈ నెల 23న తాగేసింది. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు ఇక్కడి వైద్యులు గురువారం రిఫర్ చేశారు. ఎచ్చెర్ల పోలీసులు బాలిక నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ప్రేమ వ్యవహారం కారణంగానే బాలిక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. బాలిక ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నిందితు డిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ అవసరం



సూచనలు ఇస్తోన్న ఉమామహేశ్వరి

జలుమూరు: ప్రత్యేకావసరాల పిల్లలపై మరింత శ్రద్ధ అవసరమని సహిత విద్య జిల్లా కోర్డినేటర్ ఉమా మహేశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రత్యేకావసరాల పిల్లల(భవిత కేంద్రం)ను సందర్శించి పలు సూచనలు చేశారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే భవిత కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమెతోపాటు హెచ్ఎం మెండ రామారావు, ఐఈడీ ఉపాధ్యాయులు రమేష్, కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు సతీష్, వరలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

7 మున్సిపల్ షాపులు సీజ్

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 7 మున్సిపల్ షాపులు సీజ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలియజేశారు. చాలా కాలంగా ఈ 7 మున్సిపల్ షాపుల నుంచి రూ. 3.20 లక్షలు బకాయిలుండగా వాటిని వెంటనే చెల్లించాలని నోటీసులు ఇచ్చినప్పటికీ సంబంధిత యజమానులు షాపు బకాయిలను చెల్లించలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది ఈ షాపులను గురువారం సీజ్ చేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావు ఇటీవల రెండు కిడ్నీలు పాడై మరణించారు. అతని భార్య రేవతి, ఇద్దరు కుమార్తెలు సిరి, హనీలు అనాథలుగా మిగిలిపోవడంతో దాతలు స్పందించి ఆర్థిక సాయం చేస్తున్నారు. జోగారావుతో చదువుకున్న వారు రూ.50 వేలు వసూలు చేసి ఆ డబ్బును పిల్లల పేరున ఫిక్సిడ్ డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామానికి చెందిన అమ్మా-నాన్న చారిటబుల్ ట్రస్ట్ వారు కుటుంబానికి దుస్తులతో పాటు రూ.ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు.

మూడేళ్ల పాపకు బోన్ కేన్సర్

- తల్లిదండ్రులు రోజువారీ కూలీలు
- చికిత్స చేయించలేక తల్లడిల్లిపోతున్న అమ్మానాన్నలు
- దాతల సాయం కోసం ఎదురు చూపు

గార:

మూడేళ్ల పసిపాప.. ఇప్పుడిప్పుడే ముద్దుముద్దుగా మాట్లాడడం నేర్చుకుంటోంది. కానీ ఇప్పుడా పాప ఆస్పత్రిలో ప్రాణాల కోసం పోరాడుతోంది. బోన్ కేన్సర్ సోకడంతో నవ్వడం కూడా మర్చిపోయి ఆస్పత్రి గోడల మధ్య దీనంగా కాలం వెళ్లదీస్తోంది. రోజూ పనికి వెళ్తే గానీ కడుపు నింపుకోలేని నిరుపేద తల్లిదండ్రులు కుమార్తెకు ఖరీదైన చికిత్స అందించలేక తల్లడిల్లిపోతున్నారు. దాతలు సాయం చేస్తే తమ బిడ్డ బతుకుతుందని కోరుతున్నారు.



చిన్నారి కారుణ్య

మండలంలోని నిజామాబాద్ ఎస్సీ కాలనీకి చెందిన దుమ్ము లక్ష్మీనారాయణ, లక్ష్మీలకు తొలి సంతానం కారుణ్య. ఇల్లంతా సందడి చేసే ఆ చిన్నారి, ఇప్పుడు తనకే తెలియని వింతైన వ్యాధితో ఇబ్బందులు పడుతోంది. కొద్ది నెలల కిందట కారుణ్యకు జ్వరం రాగా శ్రీకాకుళంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదురుగానున్న ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. కానీ అక్కడ సమస్యే బయట పడలేదు. ఇటీవల కారుణ్య తల్లి లక్ష్మి తన ప్రసవం కోసం కన్నవారి ఊరైన సతివాడ వెళ్లారు. కారుణ్య అక్కడ ఆడుకుంటూ సిమెంట్ రోడ్డుపై పడిపోయింది. కళ్ల మధ్యన గాటు పడటం, రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. అప్పటికే ప్లేట్‌లెట్స్ చాలా తక్కువ స్థాయికి దిగజారిపోవడాన్ని గమనించారు. వివిధ పరీక్షల తర్వాత బోన్ కేన్సర్ అని నిర్ధారణ అయ్యింది. మూడు రోజుల కిందట విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేయగా ఒక్క రోజుకే రూ.75వేలు ఖర్చు తేలింది. స్థానిక వైద్యుడు డోనర్సు ద్వారా ప్లేట్‌లెట్స్ ఇప్పించడం, వైద్యం ఉచితంగా చేశారు. కానీ ఇప్పటికే ఉన్న డబ్బంతా మందులకు, మెడికల్ పరీక్షల కోసం ఖర్చు చేసేశారు. రేషన్ కార్డు సమస్యల వల్ల ఆరోగ్య శ్రీ కూడా వర్తించడం లేదు. దాతలే దయ చూపి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాయం చేయాలనుకునే వారు
9866689256, 7995964313
నంబర్లను సంప్రదించాలని కోరుతున్నారు.



విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారుణ్య

మెస్ లేదు.. క్లాస్ సాగదు

- బీఆర్ఏయూలో ప్రారంభం కాని మెస్
- క్లాస్‌వర్క్‌పై ప్రభావం
- మెస్ బిల్లు బకాయిలు చెల్లించాలని నోటీసులు



తెరుచుకోని అల్ట్రామోడ్రన్ కిచెన్

ఎచ్చెర్ల క్యాంపస్:

బీఆర్ఏయూ విద్యార్థులు సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న వారికి విద్యా సంవత్సరం మొదటిలో ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నెల 24న వేసవి సెలవుల అనంతరం క్లాస్‌వర్క్ మొదలుపెట్టారు. క్లాస్‌లు అరకొరగానే సాగుతున్నాయి. అయితే మెస్ ఇంకా తెరవకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మెస్ ఉంటేనే క్లాస్‌లకు వస్తారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులు మెస్‌లో భోజనం చేసి, వసతి గృహంలో ఎక్కువగా ఉంటారు. మెస్ ప్రారంభం కాకపోవటం వల్ల విద్యార్థులు వచ్చినా వసతి గృహంలో ఉంటూ బయటకు వెళ్లి అల్పాహారం, భోజనం చేయాల్సి ఉంటుంది. బయటకు వెళ్లి భోజనం చేయడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో డే స్కాలర్లు మాత్రమే వస్తుండగా, వసతి గృహం ఆధారంగా క్లాస్‌వర్క్‌కు వెళ్లే విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది.

బకాయిలతో ఇబ్బంది..

వర్సిటీలో నాగావళి, వంశధార, సువర్ణముఖి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వసతి గృహాల్లో 920 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో పురుషులు 504, మహిళలు 416. వీరు అల్ట్రా మోడ్రన్ కిచెన్‌లో ఏర్పాటు చేసిన మెస్‌లో భోజనం చేస్తారు. ప్రస్తుతం మెస్ ప్రారంభించక పోవటానికి కారణం మెస్ బిల్లుల బకాయిలు. విద్యార్థులకు మెస్‌లో నెలవారీ బిల్లులు రూ.రెండు వేల నుంచి రూ.2300 వరకు వస్తాయి. కొందరు విద్యార్థులు ప్రతినెలా బిల్లులు చెల్లిస్తున్నారు. వసతి దీవెన, స్కాలర్ షిప్ పై ఆధార పడిన విద్యార్థులు ప్రభుత్వ చెల్లింపు ఆధారంగా బిల్లు చెల్లిస్తారు. ప్రస్తుతం మూడు నుంచి రెండు నెలల మెస్ బిల్లు బకాయిలు విద్యార్థులకు ఉన్నాయి. అధికారులు రూ.5000 నుంచి రూ. 7000 మధ్య చెల్లింపుల కోసం నోటీసులు కూడా ఇచ్చారు. బకాయిలు చెల్లిస్తే మెస్ ప్రారంభిస్తామని అంటున్నారు. ఇళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు మళ్లీ ఇంటికి డబ్బుల కోసం వెళుతున్నారు. కొందరు చెల్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు తమ ఇంటి వద్దే కొన్నాళ్లు ఉండి తల్లిదండ్రులు డబ్బులు సమకూర్చాక రావటానికి సన్నద్ధమవుతున్నారు. అధికారులు మాత్రం మెస్ బిల్లులు చెల్లించాక మాత్రమే మెస్ ప్రారంభించాలని భావిస్తున్నారు. అయితే మెస్ లేకపోవడం వల్ల ప్రధానంగా ఇంజినీరింగ్ వంటి కోర్సులు విద్యార్థులు క్లాస్‌లకు హాజరు కాలేకపోతున్నారు. క్లాస్‌వర్క్ నష్టపోతున్నారు. 70 శాతం వరకు విద్యార్థులు హాస్టల్‌లోనే ఉంటున్నారు. మెస్ త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> **విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది**
>
> ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. కనీస సంఖ్యలో విద్యార్థులు హాజరైన వెంటనే మెస్ ప్రారంభిస్తాం. మెస్ నిర్వహణ సైతం అప్పుల్లో నిర్వహిస్తున్నాం. అప్పులు చెల్లిస్తేనే ట్రేడర్స్ సరుకులు ఇస్తారు. మెస్ బిల్లులు విద్యార్థులు చెల్లించటం తప్పనిసరి. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సంఖ్య పరిశీలించి ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.
>
> – డాక్టర్ ఎస్.లోకేశ్వరి, చీఫ్ వార్డెన్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ

సారవకోట: జూలై 1న సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,19,147 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయని, ఒకటో తేదీ నుంచి ఒక్కో సచివాలయ ఉద్యోగి యాభై చొప్పున పింఛన్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి కొత్తగా ఇవ్వనున్న పింఛన్లకు గాను రూ 211.7 కోట్లు అవసరం అవుతుందన్నారు. ఓపీ, వితంతు, వీవర్స్, ఫిషర్ మ్యాన్, ఒంటరి మహిళ, డప్పు కళాకారులు తదితర వర్గాలకు ప్రభుత్వం ప్రకటించినట్లు మూడు నెలల ఎరియర్స్ సైతం అందించనున్నట్లు తెలిపారు. సారవకోట మండలానికి పారిశుద్ధ్య మెరుగుకు తనను ప్రత్యేకాధికారిగా ఉన్నతాధికారులు నియమించారని కనుక మండలంలో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయనతో పాటు టెక్కలి డివిజన్ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీరాములు, ఏపీఎం గోవిందరాజులున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

ఎస్పీని కలిసిన ఎస్ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన ఏఎస్ఐలు (అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు) కె.మన్మధరావు, ఎస్.కృష్ణారావు, ఎం.సుధాకర్‌లు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధికను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విశాఖపట్నం రేంజి పరిధిలో పలువురు ఏఎస్ఐలు ఇటీవల ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన విషయం విదితమే. రేంజి పరిధిలో మన జిల్లా నుంచి ఆరుగురు ఏఎస్ఐలు ఈ కోవలో ఉండగా ముగ్గురు మన జిల్లాలోనే రిపోర్ట్ చేయడం విశేషం.



ఎస్పీ రాధికను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఐలు

'ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి'

కొత్తూరు: ఉపాధి పనులు చేసిన కూలీలకు ప్రభుత్వం బకాయి ఉన్న ఆరు నెలల వేతనం తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపీడీఓ త్రివిక్రమరావుకు ప్రసాదరావు వినతి పత్రం అందజేశారు. చాలీ చాలనీ వేతనాలతో సతమతమవుతున్న ఉపాధి వేతనదారులు అప్పులు చేసి బతకాల్సి వస్తోందని అన్నారు. పని అడిగిన ప్రతి వ్యక్తికి 15 రోజులు పనిదినాలు కల్పించాలని ప్రసాదరావు కోరారు. వర్షాలు కురుస్తున్నందున పనులు లేక కూలీలు ఉపాధి కోల్పోతున్నందున బకాయిలు ఉన్న 6 నెలలు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని ప్రసాదరావు కోరారు.



ఎంపీడీఓ త్రివిక్రమరావుకు వినతి పత్రం అందిస్తున్న సిర్ల ప్రసాదరావు

కేరళలో వలస కార్మికుడు మృతి



సురేష్ (ఫైల్)

కవిటి: మండలంలోని జి.కరాపాడుకు చెందిన నర్తు సురేష్ (కాశీ)(24) అనే వలస కార్మికుడు కేరళలో తాను పని చేస్తున్న పరిశ్రమలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తూ మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి తమకు సమాచారం తెలిసిందన్నారు. గ్రామానికి చెందిన నర్తు మోహిని చిన్నకుమారుడైన సురేష్(కాశీ) ఇటీవలే పెళ్లి సంబంధం కుదిరి నిశ్చితార్థం కూడా జరిగిన నేపథ్యంలో ప్రమాదవశాత్తూ మరణించడంపై గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. జనరేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సురేష్ విధి నిర్వహణలో ఉండగా ప్రమాదం జరగడంతో తలకు బలమైన గాయాలు తగిలి మృతి చెందినట్టు సమాచారం.

ఘనంగా శ్రీపుష్పయాగ మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 3వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామివారి శ్రీపుష్పయాగ మహోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, చామర్తి జగన్నాథాచార్యుల నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులను వేదికపై ఉంచి అనేక రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవంలో మహిళలు రోలుపై రోకలితో సుగంధ ద్రవ్యాలను దంచారు. అలాగే హోమం పూర్ణాహుతి, వసంత మండపారాధన, చక్రస్నానం కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షుడు దుంపల సన్యాసిరావు మాట్లాడుతూ 4వ వార్షికోత్సవం సమయానికి స్వామికి స్వర్ణకిరీటం చేయించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు.

వార్షికోత్సవాలకు సాయం అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దంపతులు, మొదలవలస ఉషారాణి దంపతులు, బిర్లంగి రామ్మోహన్, కరణం గోవిందరాజులు కిమిడి జగన్మోహనరావు, ఎంపీటీసీ బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, పిల్లా వెంకటప్పారావు, తమ్మినేని సత్యానారాయణ, గురుగుబెల్లి జగన్మోహనరావు, కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి, సురేష్ కుమార్, బిందు కృష్ణ, మధుసూదనరావు, హుతాసన, శ్రీనివాసరావు, రమేష్‌చంద్ర, శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.



సుగంధ ద్రవ్యాలను దంపుతున్న మహిళలు



డీసీసీబీ కాలనీలో వెంకన్న కల్యాణ వేడుకల సందర్భంగా శ్రీపుష్పయాగ మహోత్సవం

జోరుగా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

జి.సిగడాం: ఏపీటీఎఫ్ సంఘం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి జిల్లాలో పదివేల మందితో సభ్యత్వం లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, మండల శాఖ అధ్యక్షుడు కాయల రమేష్, కిల్లారి వెంకటరమణ అన్నారు. వారు గురువారం మెట్టవలస, సంతవురిటి, గెద్దకంచరాం, బాతువ, పెనసాం, చంద్రయ్యపేట మర్రివలస, నాగులవలస సీతంపేట, నక్కపేట, పాలఖండ్యాం, జి.సిగడాం, వెంకయ్యపేట, ఎందువ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 117 జీఓను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సభ్యులు చీర రాము, దుంగ వీరయ్య, పిట్టా అప్పారావు, కోనా నారాయణప్పడు, పప్పల తిరుమలరావు, చిత్తిరి జగదేశ్వరరావు తదితరులు ఉన్నారు.



గెద్దకచరాంలో సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

సస్య రక్షణతో మేలైన దిగుబడి

కవిటి: ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతులు నారుమడి దశ నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యల ద్వారా మేలైన దిగుబడులు సాధించగలరని సోంపేట సబ్‌డివిజన్ ఏడీఏ కె.జగన్ మోహనరావు అన్నారు. గురువారం మండలంలోని పుటియాదళ రెవెన్యూ విలేజ్‌లో వరి సాగు చేస్తున్న రైతుల నారుమడులు, పచ్చిరొట్ట పైర్ల సాగును ఆయన పరిశీలించారు. నారుమడి దశలో సూడోమోనాస్ అనే జీవశిలీంద్రనాశినితో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా అగ్గితెగులు పాము పొడ తెగుళ్లను సమర్థంగా అరికట్టవచ్చని తెలిపారు. 30 కిలల విత్తనాన్ని 250 గ్రాముల సూడోమోనాస్ జీవశిలీంద్రనాశినిలో శుద్ధిచేసి చల్లుకోవాలన్నారు. విత్తనాలు వేసిన తర్వాత, నాట్లు వేసేందుకు మరో పదిరోజుల ముందుగా 10సెంట్ల నారుమడికి రెండుకిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి పైపాటుగా చల్లుకోవాలన్నారు. ఇది వాడుకోవడం ద్వారా పంట నాట్లు వేసిన ప్రారంభ దశలో వచ్చే దోమపోటు, కాండం తొలుచు పురుగు, పాముపొడ తెగులు రాకుండా చేస్తుందన్నారు. పచ్చిరొట్ట పైర్లు పుటియాదళ రెవెన్యూలో సుమారు 100 ఎకరాలకు పైగా వేయడం చాలా ఆనందదాయకమన్నారు. ప్రస్తుతం ఇది చక్కగా పెరుగుతుండడం మంచి పరిణామమని అన్నారు. ఈ ఎరువు దమ్ముపెట్టినపుడు ఎకరానికి 60 కిలలో సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ వేయడం ద్వారా పంటకాలం మొత్తం భాస్వరం శాతం పెరిగి నాట్లు వేసిన నాటి నుంచే మంచి పిలకలతో దుబ్బు చేయడం, సూక్ష్మపోషకాలను పీల్చుకోవడం జరుగుతుందన్నారు.



పుటియాదళలో ఖరీఫ్ వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఓ జగన్మోహనరావు